సాక్షి తిరుపతి

బుధవారం ၊ 16 ၊ ఏప్రిల్ ၊ 2025



అరాచక శక్తులపై చర్యలు

ఐటీడీపీ అరాచక శక్తులపై చర్యలు తీసుకోవాలని పెళ్లకూరు జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా కోరారు. - 8లో



మఠం భూములపై 'పచ్చ గద్దలు'

తిరుపతిలోని హాథీరాంజీ మఠం భూములపై టీడీపీ నేతల కన్ను పడింది. ఆ భూములు కబ్జాకు యత్నిస్తున్నారు. - 8లో



తిరుపతిలో స్పోక్స్ మోడల్ హబ్

తిరుపతిలో స్పోక్ మోడల్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. అందుకు స్థల పరిశీలన చేశారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు అసెంబ్లీ పద్దుల కమిటీ రాక

– జిల్లాలో రెండు రోజుల పర్యటన

తిరుపతి అర్బన్: రెండు రోజుల పర్యటనలో భాగంగా జిల్లా అసెంబ్లీ పద్దుల కమిటీ బుధవారం తిరుపతి జిల్లాకు రానుందని తిరుపతి కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ పద్దుల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావుతోపాటు 11 మంది సభ్యులతో కూడిన పద్దుల కమిటీ సభ్యులు బుధవారం తెల్లవారుజామున 5.15 గంటలకు తిరుపతి శ్రీ పద్మావతి అతిథి గృహానికి చేరుకుంటారని చెప్పారు. అనంతరం 11 గంటలకు బయలుదేరి చిత్తూరు జిల్లా సమీక్ష ముగించుకుని, సాయంత్రం 5.30 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి రాత్రి 7.30 గంటలకు తిరుమల చేరుకుని రాత్రి బస చేస్తారని చెప్పారు. 17వ తేదీ గురువారం ఉదయం శ్రీవారి దర్శనం చేసుకుని, 10 గంటలకు తిరుమల నుంచి బయలుదేరి తిరుపతి శ్రీ పద్మావతి అతిథి గృహానికి చేరుకుని 11.30 గంటలకు టీటీడీ ఈఓ శ్యామలరావుతోపాటు పలువురు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం 5.15 గంటలకు రైలులో విజయవాడకు తిరుగు ప్రయాణం కానున్నారని పేర్కొన్నారు.

మానవ సేవే లక్ష్యం కావాలి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి తుడా: వైద్య విద్యార్థులకు మానవ సేవే మాధవసేవ అనే దృక్పథంతో పని చేయాలని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్విమ్స్ ఆస్పత్రిలో నూతనంగా పీజీ అడ్మిషన్లు పొందిన వైద్య విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షలో ప్రతిభ కనబరచిన ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని నీట్‌లో ప్రతిభ చూపి పీజీ కోర్సులు అడ్మిషన్లు పొందిన వైద్య విద్యార్థులకు అభినందనలు తెలిపారు. భగవంతుని స్వరూపమైన టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న స్విమ్స్ ఆస్పత్రిలో పీజీ చదవడం దేవుని వరమని తెలిపారు. విద్యనభ్యసిస్తూ పేదలకు సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా, పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషా కళావత్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, నెఫ్రాలజీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ శివ కుమార్, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ యర్రం రెడ్డి, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



కలియుగ వైకుంఠం.. పరమ పవిత్రం ..ఆధ్యాత్మిక నిలయం..భక్తులకు అది అపురూపం.. అంతటి తిరుమల క్షేత్రం నేడు అపవిత్రం.. మద్యం, మాంసం, పాదరక్షలతో ఆలయ ప్రవేశ యత్నం.. గోశాలలో గో మరణ మృదంగం.. శ్రీవారి ఆలయంపై డ్రోన్ల సంచారం ఒకటేమిటీ వరుస సంఘటనలు చోటు చేసుకోవడం మహా అపచారం.. వెరసి భక్తుల దెబ్బతిన్న మనోభావం .. ప్రశ్నించిన గొంతు నొక్కే ప్రయత్నం.. ఎదురుదాడి.. తమ పాపం ఎదుటి వారిపై నెట్టే ప్రచారం జరుగుతోంది. ఏడుకొండలపై అసలేం జరుగుతోంది.. ఏమై పోతోంది.. అంతా సత్యం వధ.. ధర్మం చెరేనా? అని భక్తులు మదనపడుతున్నారు.



తిరుమలలో మద్యం మత్తులో వీరంగం చేస్తున్న యువకుడు(ఫైల్)

అపచారం పరిహాస్యం

ప్రశ్నించే గొంతు నొక్కేస్తారా?

- లోపాలను ఎత్తి చూపితే.. పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదే
- భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలి
- ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం దారుణం
- తిరుమలలో అపచారాల కట్టడికి చర్యలు తీసుకోలేరా?
- 10 నెలలుగా సాక్షాత్తు తిరుమలలో జరిగిన ఘటలకు బాధ్యులెవరు?
- ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం అపచారాలను అడ్డుకోవాలి
- టీటీడీ అధికారులకు స్థానికులు, భక్తులు, మేధావుల హితవు

తిరుపతి సిటీ: కలియుగ వైకుంఠంలో గత పది నెలలుగా సత్యం వధ.. ధర్మం చెరగా పాలన సాగుతోంది. దీన్ని ప్రశ్నించే గొంతుకలపై ఎదురుదాడి జరుగుతోంది. ఆధ్యాత్మిక సంస్థలో జరిగే లోటుపాట్లు సున్నిత పరిష్కారానికి చర్యలు లేకపోగా.. టీటీడీలో పచ్చపాలకులు, ఏజెంట్లు, అల్లరి మూకలు చేస్తున్న తప్పిదాలను రాజకీయకోణంలో చూపుతూ ప్రత్యర్థులపై నెట్టే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇదంతా చూస్తే అసలు తిరుమల, తిరుపతి దేవస్థానంలో ఏమి జరుగుతోంది.. అసలు తిరుమల.. ఆధ్యాత్మిక క్షేత్రమా.. పచ్చ పాపాలకు వ్యాపార నిలయమా?.. అని భక్తులు మనోవేదనకు గురికావాల్సిన దుస్థితి నెలకొంటోంది.



తిరుమలలో పోలీసులు పట్టుకున్న ఎగ్ పలావ్(ఫైల్)

రాజకీయ ఏజెంట్లుగా అధికారులు

టీటీడీలో జరుగుతున్న అపచారాలను కప్పిపుచ్చేందుకు పచ్చనేతలు ఆ ధార్మిక సంస్థలో అధికారులనే రాజకీయ ఏజెంట్లుగా మార్చుతున్నారని భక్తులు వాపోతున్నారు. ఈ క్రమంలోనే వారు పవిత్ర పుణ్యక్షేత్రంలో జరుగుతున్న అపచారాలను ఎత్తి చూపితే.. వాటిని పక్కదారి పట్టించేందుకు సాక్షాత్తు కార్యనిర్వాహణాధికారి స్థాయి అధికారులే ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. అలాగే వారు చేసిన నేరాలు ప్రశ్నించే వారిపై నెట్టేందుకు తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తూ వారికి అనుకూల మీడియాల్లో ప్రచారం చేస్తూ టీడీపీ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని భక్తులు మండిపడుతున్నారు.

పది నెలలుగా అన్నీ అపచారాలే..

ఆధ్యాత్మిక రాజధానిగా గుర్తింపు పొందిన పవిత్ర పుణ్యక్షేత్రంలో గత 10 నెలలుగా అన్నీ అపచారాలే జరుగుతున్నాయి. శ్రీవారి క్షేత్రంలో మద్యం బాటిళ్లు, బిర్యానీలు, మాంసం, మందుబాబుల వికృత చేష్టలు, పాదరక్షలతో ఆలయంలోకి ప్రవేశించే యత్నం, డ్రోన్ కెమెరాల హల్‌చల్, పాపవినాశం తీర్థంలో బోట్ల విహారం, టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న గోశాలలో గోవుల మరణ మృదంగం, ముంతాజ్ హోటల్ అనుమతులు తదితర సంఘటనలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. వీటిపై సాక్షాత్తు స్వామిజీలు మండిపడి, టీటీడీ, ప్రభుత్వ వ్యవహారశైలికి నిరసనగా ధర్నాలు చేసిన ఘటనలు సామాన్య భక్తులతో పాటు స్థానికులను కలవరపెట్టాయి. వీటిని కట్టడి చేయాల్సిన ప్రభుత్వం, టీటీడీ అధికారులు లోపాలను ఎత్తి చూపుతున్న సామాన్యులపైనా, భక్తులపై కక్ష్య సాధింపు చర్యలు దిగడం దారుణమని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పవిత్రపుణ్యక్షేత్రంలో జరిగే అపచారాలపై దృష్టి పెట్టకుండా రాజకీయ కోణంలో చూస్తూ అధికారులు వ్యవహరించడం సమజసం కాదంటూ స్థానికులు, భక్తులు, ప్రజా సంఘాలు, మేధావులు హితవు పలుకుతున్నారు.



తిరుమలలో పట్టుబడిన మద్యం(ఫైల్)

అధికారుల అప్రమత్తత అవసరం



టీటీడీలో తరచూ జరుగుతున్న ఘటనలు భక్తులను బాధిస్తున్నాయి. శ్రీవారి సన్నిధిలో ఇలాంటి అపచారాలు జరగకుండా కట్టడి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అధికారులు అప్రమత్తంగా ఉండి, తిరుమల పవిత్రతను కాపాడాల్సిన అవసరం ఉంది. డ్రోన్ కెమెరాలతో ఫొటోషూట్ చేయడం ఎంత అపచారం. డ్రోన్ కెమెరాను ఎలా అనుమతించారో? అధికారులే సమాధానం చెప్పాలి. తిరుమలలో అభద్రతాభావం నెలకొంటే ప్రమాదమే. అధికారులు మేలుకోవాలి.

–సెల్వకుమార్, తమిళ భక్తుడు, వేలూరు

అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట పడేనా?



పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలకు అపకీర్తి తీసుకువచ్చే చర్యలను అధికారులు అడ్డుకోవాలి. మందు, మాంసం, డ్రోన్ కెమెరాల హల్‌చల్, అకతాయితీల వికృత చేష్టలను ప్రశ్నించే హక్కు ప్రతి భక్తునికీ ఉంటుంది. వాటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. అపచారం జరిగిన ఘటనపై ప్రత్యేక దృష్టి సారించి పునరావృతం కాకుండా టీటీడీ అధికారులు చర్యలు తీసుకోవాలి. గోవుల మృతి వార్తలు భకులు, జంతు ప్రేమికులను బాధించాయి.

–మహాలక్ష్మి, శ్రీవారి భక్తురాలు, శ్రీకాళహస్తి

అపచారాలకు అడ్డుకట్ట వేయలేరా?



కొన్ని నెలలుగా తిరుమల పుణ్యక్షేత్రంలో జరుగుతున్న దారుణమైన ఘటనలకు టీటీడీ అధికారులు అడ్డుకట్ట వేయకపోవడం విచారకరం. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా మద్యం, మాంసం, బహిరంగంగా దొరకడం అపచారం. తిరుమలలో ఆకతాయితీలు మద్యం సేవించి గొడవలు పడిన సంఘటన బాధించే అంశం. టీటీడీ గోశాలలో గోవుల మరణాలపై వస్తున్న వార్తలు గో ప్రేమికులు, శ్రీవారి భక్తులను మరింత క్షోభకు గురిచేశాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా టీటీడీ చర్యలు చేపట్టాలి. లోపాలను ఎత్తి చూపడం భక్తుల బాధ్యతగా అధికారులు గుర్తించాలి.

– తుమ్మ ఓంకార్, తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షులు, తిరుపతి

వివరణ కాదు.. విచారణ జరపాలి



టీటీడీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గోశాలలో గోవులు అధిక సంఖ్యలో మరణించాయని వస్తున్న ఆరోపణలపై టీటీడీ అధికారులు ప్రెస్ మీట్‌లు పెట్టి వివరణ ఇవ్వడం దారుణం. వాటి పై వాస్తవాలను వెలికితీసేందుకు విచారణ చేపట్టి నిజాలను నిగ్గు తేల్చాలి. మూగజీవులు ఇంత పెద్ద సంఖ్యలో మృతి చెందడం, అనారోగ్యానికి గురికావడం భక్తుల, జంతు ప్రేమికుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయి. తక్షణం అఖిలపక్షం ఆధ్వర్యంలో పరిశీలన జరపాలి. నిర్లక్ష్యం కారణమైతే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. – వందవాసి నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి, తిరుపతి

గొంతు నొక్కడం భావ్యమా?



టీటీడీలో ప్రతినిత్యం ఏదో ఒక అపచారం జరగడం బాధించే అంశం. అధికారులు బేషాజాలకు పోకుండా భక్తుల మనోభావాలను కాపాడాలి. నిషేధిత వస్తువులను తిరుమలకు చేరకుండా పటిష్ట తనిఖీలు నిర్వహించాలి. పార్టీలకతీతంగా శ్రీవారి సన్నిధిలో అపచారం జరిగితే లోపాలను ఎత్తి చూపడం భక్తుల హక్కు, కర్తవ్యం కూడా. అలాంటి లోపాలు జరిగినప్పుడు వెంటనే అధికారులు వాటిని సరిదిద్దేందుకు సిద్ధపడాలే తప్ప, గొంతు నొక్కడం, కేసులు బనాయించడం విచారకరం.

– నరసింహులు, స్థానిక భక్తుడు, తిరుపతి

త్వరలో పారదర్శకంగా బదిలీలు

తిరుపతి క్రైమ్: తిరుపతి జిల్లా పరిధిలో ఐదేళ్లు దాటిన ప్రతి సిబ్బందికి త్వరలో పారదర్శకంగా బదిలీలు నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. మంగళవారం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జిల్లా పురోగతిపై అదనపు ఎస్పీలు, సబ్ డివిజన్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాటు ఒకే స్టేషన్‌లో పని చేసిన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా బదిలీలు చేపడతామన్నారు. సిబ్బంది పనితీరు ఆధారంగా బదిలీలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే రాత్రి సమయంలో బీట్లు తిరిగే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. ఎలాంటి అసాంఘిక శక్తులకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. వేసవికాలంలో దొంగలపై ప్రత్యేక నిఘా ఉంచి, ప్రజలకు భద్రత కల్పించాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలన్నారు. ప్రతి దేవాలయాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలాగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి, వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు వెంకటరావు, రవి మనోహరాచారి, డీఎస్పీలు సిబలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

పనులు అడ్డుకున్న గ్రామస్తులు

చిల్లకూరు: తీర ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న క్రిస్ సిటీ కోసం సేకరించిన భూములకు పరిహారం అందివ్వకుండా రోడ్డు పనులు చేస్తుండడంతో మంగళవారం తమ్మినపట్నం గ్రామస్తులు అక్కడకు చేరుకుని పనులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్ సిటీ కోసం తాము సాగు చేసుకునే భూములను సేకరించి పరిహారం ఇవ్వకనే పనులు చేపట్టడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. దీంతో ఆ ప్రాంతానికి తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్ఓ బాలాజీ చేరుకుని గ్రామస్తులకు సర్దిజెప్పే ప్రయత్నం చేశారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు


తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరింది. సోమవారం అర్ధరాత్రి వరకు 73,078 మంది స్వామివారిని దర్శించుకోగా 25,831 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.58 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

● నిమ్మ.. అమ్మకు అలంకార వైభవం



తిరుపతి గ్రామదేవత తాతయ్యగుంట తమిళమాసమైన చిత్ర నెల తొలి మంగళవారం సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయలతో విశేషాలంకారం చేశారు. ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. అలంకరణకు ఉభయకర్తలుగా లావణ్యరెడ్డి, శైలజ వ్యవహరించారు. ఆలయ ఈఓ ఏ.జయకుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. – తిరుపతి కల్చరల్

అవుట్ ఆఫ్ సర్వీస్.. నో క్యాష్.. మనం తిరుపతి జిల్లాలో ఏ ఆటోమేటెడ్ టెల్లర్ మిషన్ వద్దకు వెళ్లినా దర్శనమిచ్చే బోర్డు ఇదీ. దీనికితోడు ఏటీఎం స్క్రీన్‌లు సరిగ్గా కనిపించకపోవడం.. పది నిమిషాలైనా నగదు రాకపోవడం..వస్తుందో రాదో తెలియపోవడం వంటి సమస్యలు సాధారణంగా మారిపోయాయి. ఫలితంగా నగరవాసులు నగదు కోసం పడే పాట్లు వర్ణనాతీతంగా మారాయి.



- అలంకారప్రాయంగా 80 శాతం ఏటీఎంలు
- డిపాజిట్ మిషన్లూ పనిచేయడం లేదు
- నగరవాసులకు నగదు పాట్లు వర్ణనాతీతం
- లబోదిబోమంటున్న ఖాతాదారులు



శ్రీనివాసపురంలో పనిచేయని ఏటీఎం



ఆర్టీసీ బస్టాండ్‌లో ఏటీఎం వద్ద నో క్యాష్ బోర్డు

పర్యవేక్షణ బాధ్యత ఎవరిది?

అధిక శాతం బ్యాంకులు ఏటీఎం నిర్వహణ బాధ్యత నుంచి తప్పుకోవడంతో పర్యవేక్షణ కొరవడుతోంది. ఎక్కువ బ్యాంకులు ఆటోమేటెడ్ టెల్లర్ మిషన్ల నిర్వహణను నెట్‌వర్క్ సంస్థలకు అప్పగించాయి. వీటిలో నగదు నింపడం, మరమ్మతులు నెట్‌వర్క్ సంస్థలే చూస్తున్నాయి. ఆ సంస్థలు పట్టించుకోకపోవడంతోపాటు ఏటీఎంలు పని చేయని విషయాన్ని వినియోగదారులు బ్యాంకుల దృష్టికి తీసుకెళ్లితే.. అధికారులు నెట్ వర్క్ సంస్థలకు సమాచారమందించి మరమ్మతులు చేయించాల్సి వస్తోంది. ఫలితంగా ఏటీఎంపై బ్యాంకుల పర్యవేక్షణ కొరవడి, వాటి పనితీరు అధ్వాన్నంగా మారుతోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డబ్బుల్లేవ్.. డబ్బుల్లేవ్!

తిరుపతి అర్బన్: ప్రస్తుత సమాజంలో ప్రతి వ్యక్తికీ బ్యాంకు ఖాతాలు, ఏటీఎం తప్పనిసరయ్యాయి. ఉద్యోగులు, వ్యాపారులు, పెన్షనర్లు, విద్యార్థులు ఇలా అందరూ నేడు బ్యాంకులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే సమయంలో అన్ని వేళలా ఉపయోగపడాల్సిన ఏటీఎంల సేవలు మృగ్యమయ్యాయి. ఎక్కడ ఏటీఎంకు వెళ్లినా 'అవుట్ ఆఫ్ సర్వీస్' అన్న బోర్డులు దర్శనమిస్తున్నాయి. దీంతో వినియోగదారులు ఇక్కట్లు పడుతున్నారు.

పనితీరు అధ్వాన్నం

జిల్లాలో ఏటీఎంల పనితీరు అధ్వాన్నంగా ఉంది. నిత్యం బ్యాంకుల్లో రద్దీ చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ప్రతి ఖాతాదారుడికి ఏటీఎంతోపాటు చెక్ బుక్‌లు ఇష్టారాజ్యంగా ఇచ్చేస్తున్నారు. డిజిటల్ చెల్లింపుల యుగంలో ఏటీఎంల వాడకం ఎంతో సొలభ్యమే. తిరుపతి నగరంలోనే 200కు పైగా ఏటీఎంలున్నాయి. అయితే అందులో 80 శాతం ఏటీఎంలు సక్రమంగా పనిచేయడం లేదు. గుర్తింపు పొందిన బ్యాంకుల ఏటీఎంలు సైతం అలంకారప్రాయంగా మిగిలిపోతున్నయనే చర్చసాగుతోంది. ఈ ఏటీఎంల కన్నా బ్యాంకులే నయమంటూ పలువురు ఖాతాదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి నగరంలో 20 వరకు ఏటీఎం నగదు డిపాజిట్ మిషన్లు ఉన్నాయి. వాటి పరిస్థితి కూడా అధ్వాన్నంగా మారిందని పలువురు విమర్శలు చేస్తున్నారు. ప్రధానంగా వరుసగా సెలవుదినాలు వచ్చి సందర్భంగా ఓ వైపు బ్యాంక్‌లు లేక...మరోవైపు ఏటీఎంలు పనిచేయకపోవడంతో ఖాతాదారులు తిప్పలు పడుతున్నారు. ప్రధానంగా డిపాజిట్ మిషన్లు పనిచేయకపోవడంతో తంటాలు తప్పడం లేదు.

జిల్లా సమాచారం

జిల్లాలో బ్యాంకులు	521
జిల్లాలో ఏటీఎంలు	318
జిల్లాలో పనిచేయని ఏటీఎంలు	80 శాతం
ఎప్పుడూ నగదులేని ఏటీఎం	20 శాతం


ఎక్కడికెళ్లినా నోక్యాష్



ఏ ఏటీఎంకు వెళ్లినా నోక్యాస్ బోర్డులు పెట్టి ఉన్నారు. తిరుపతిలో మంగళవారం పలు ఏటీఎంలకు వెళ్లాం. అయితే పలు ఏటీఎంలు పనిచేయడం లేదు. కొన్ని ఏటీఎంలు నగదు లేదు. దీంతో ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు. కనీసం తిరుపతి బస్టాండ్, రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఏటీఎంల్లోనూ నగదు ఉండడం లేదు.

– జనార్థన్‌రెడ్డి, బ్యాంక్ ఖాతాదాదురు, తిరుపతి

సమర్థవంతంగా పనిచేయలేదు



ఏటీఎంలు సమర్థవంతంగా పనిచేయడం లేదు. ఒక రోజు పనిచేస్తే నాలుగు రోజులు పని చేయడం లేదు. పనిచేసేనా నగదు ఉండడం లేదు. ఒక్కొక్కసారి నగదు కోసం పది ఏటీఎంలకు తిరిగిన సందర్భాలున్నాయి. అయినా ప్రయోజనం ఉండడం లేదు. బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి ఏటీఎంలు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నాం. ఖాతాదారుల కష్టాలను గుర్తించాల్సి ఉంది.

– నరేంద్రయాదవ్, బ్యాంక్ ఖాతాదారుడు, రేణిగుంట

గూడూరులోనూ అలంకారప్రాయమే



గూడూరులోనూ ఏటీఎంలు అలంకారప్రాయంగానే మారాయి. నగదు ఉండడం లేదు. ఓ ప్లానింగ్ ప్రకారం ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నగదును ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే కొందరు పట్టించుకోవడం లేదు. ఖాతాదారులను అవసరాలను దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంది. బ్యాంక్ వద్దకు వెళ్లి నగదు డ్రా చేస్తున్నారు. డిపాజిట్ చేయాలన్నా బ్యాంక్‌కు వెళ్లుతున్నారు.

–హేమంత్ కుమార్, బ్యాంక్ ఖాతాదారుడు, గూడూరు

● బోసిపోయిన సముద్ర తీరం



మత్స్యకారుల అరుపులు.. వేటకు సాగనంపే కుటుంబ సభ్యుల రాకపోకలు, ఉత్సాహంతో చేపలు కొనుగోలు చేసే కేరళ వ్యాపారుల సందడి ఒక్క సారిగా వేట విరామంతో బోసిపోయింది. మంగళవారం మత్స్యకారులు తమ బోట్లను సముద్ర తీరంలో భద్ర పరిచి ఇంటి వద్ద సేదతీరడం కనిపించింది. ప్రభుత్వం 61 రోజులపాటు వేట విరామం ప్రకటించడంతో అందుకు కట్టుబడిన మత్స్యకారులు వేటను నిలుపుదల చేసి బోట్లను ఒడ్డున లంగర్ వేశారు. – వాకాడు

క్లుప్తంగా

విద్యుదాఘాతంలో పాడి పశువు మృతి


పాడి ఆవు కళేబరం

నాగలాపురం: విద్యుత్ షాక్‌కు గురై రెండు పాడి ఆవులు మృతి చెందాయి. బాధితుల కథనం మేరకు.. పిచ్చాటూరు మండలంలోని రెప్పాలపట్టు సమీపంలో తెగి కింద పడి ఉన్న అరణియార్ ప్రాజెక్టు విద్యుత్ తీగలు తగిలి ఆ మార్గంలో మేతకు వెళ్లే పాడి పశువు సంఘటన స్థలంలోనే మృతి చెందింది. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

నారాయణ స్కూలుకు షోకాజు నోటీసు


నారాయణ స్కూలు భవనం వద్ద ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి న్యూబాలాజీ కాలనీలోని నారాయణ స్కూలుకు డీవైఈఓ బాలాజీ మంగళవారం షోకాజు నోటీసు ఇచ్చారు. సరైన అనుమతి పత్రాలు లేకుండా పాఠశాలను నడుపుతున్నట్లు విద్యార్థి సంఘాలు డీఈఓ కేవీఎన్ కుమార్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో డీఈఓ ఆదేశాల మేరకు డీవైఈఓ ఆ పాఠశాలను సందర్శించారు. ఆ పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సరైన రికార్డులు లేకపోవడంతో షోకాజు నోటీసు అందించారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

జిల్లా వ్యాప్తంగా పలు విద్యాసంస్థలు అనుమతులు లేకుండా పాఠశాలలను నడుపుతున్నాయని ఎస్‌యూఐ, జీఎస్ఎస్, ఎస్ఎల్ఎస్ఏ విద్యాసంఘాల నాయకులు ఆరోపించారు. నారాయణ పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో అనేక పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా టెక్నో, ఈటెక్నో, ఒలంపియాడ్, ఐఐటీ ఫౌండేషన్, సీఓ తదితర పేర్లతో పాఠశాలను నిర్వహిస్తూ లక్షలాది రూపాయలను దండుకుంటున్నారని ఆరోపించారు. తిరుపతి నగరంలో నారాయణ విద్యాసంస్థ కమర్షియల్ భవనంలో అనుమతులు లేకుండా గత 6 నెలల నుంచి పాఠశాలను నిర్వహిస్తుండడం దుర్మార్గమన్నారు. సొంతంగా పుస్తకాలను ముద్రించి, వాటిని అధిక ధరలకు అమ్ముకుంటూ తల్లిదండ్రులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు జెన్నె మల్లికార్జున, సుందరరాజు, బాలాజీ, చంద్రనాయక్, కుమార్, బాలు పాల్గొన్నారు.

మఠం భూములపై పచ్చ గద్దలు

రూ.150 కోట్ల భూముల దురాక్రమణకు రంగం సిద్ధం

- అవిలాల వద్ద 17 ఎకరాల భూ ఆక్రమణకు పక్కా స్కెచ్
- స్థానిక టీడీపీ ముఖ్యనేత అండతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు
- అయినా కన్నెత్తి చూడని మఠం అధికారులు
- రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్‌పై గ్రామస్తుల ఆగ్రహం
- ఆందోళనలకు సిద్ధమవుతున్న ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు


అవిలాల, లింగేశ్వరనగర సమీపంలో ఆక్రమణకు గురవుతున్న హథీరాంజీ మఠం భూమి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అసలే గద్దలు.. వాటికి 'అధికార' రాబందులు తోడయ్యాయి. ఇంకేముంది.. అన్నీ కలిసి ఆధ్యాత్మిక నగరం తిరుపతిపై వాలిపోయాయి. కళ్లు మూసి తెరిచేలోపు కోట్ల రూపాయల విలువైన మఠం భూములను మాయం చేస్తున్నాయి. అభ్యంతరం చెప్పిన హథీరాంజీ మఠం అధికారులపై విరుచుకుపడుతున్నాయి.

అసలేం జరిగిందంటే?

తిరుపతికి ఆనుకుని ఉన్న అవిలాల, లింగేశ్వర నగర్ ప్రాంతాల్లో 147/1, 148/2 సర్వే నంబర్లలో 17 ఎకరాల భూమి శ్రీహథీరాంజీ మఠానికి చెందినట్టుగా ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. ఈ భూమిని ఆక్రమణదారులు కబ్జాకు యత్నిస్తున్నట్టు సమాచారం. ఈ భూమి విలువ రూ.150 కోట్లకు పైమాటే. గతంలో ఆ భూమి తమదేనంటూ నరసింహారెడ్డితోపాటు మరికొందరు స్వాధీనం చేసుకోవడానికి పలుమార్లు ప్రయత్నించినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. హథీరాంజీ మఠం ఆధీనంలో ఉన్న ఆ భూమిపై పలు కోర్టుల్లో వ్యాజ్యాలు నడుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత స్థానిక టీడీపీ ముఖ్య నేత సహకారంతో ఆ మఠం భూములను కొట్టేయడానికి తీవ్ర ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇందులో భాగంగానే నరసింహారెడ్డి పేరిట అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్టు స్థానికులు చెబుతున్నారు.

రంగంలోకి చిత్తూరు గ్యాంగ్

ఇప్పటికే ఆక్రమణదారులు, స్థానిక టీడీపీ ముఖ్యనేత మధ్య ఒప్పందం కుదరడంతో చిత్తూరు గ్యాంగ్ రంగంలోకి దిగినట్టు సమాచారం. ఆ గ్యాంగ్‌ను అడ్డంపెట్టుకుని అతి త్వరలో ఆ మఠం భూములకు కూడా ప్రహరీ నిర్మాణం చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. అదే జరిగితే గతంలో రూ.100 కోట్ల విలువైన మఠం భూమి కబ్జాకు గురవగా మరో రూ.150 కోట్ల విలువైన మఠం భూమి ఆక్రమణదారుల పరమవుతుందని అవిలాల వాసులు ఆవేదన చెందుతున్నారు.

ప్రభుత్వం ఉదాసీనత

తిరుపతి పరిసరాల్లోని మఠం భూముల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనతను, జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారుల తీరుపై స్థానిక ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇందుకేనా టీడీపీకి ఓటు వేసింది.. అంటూ మండిపడుతున్నారు. మఠం భూముల ఆక్రమణలను కొనసాగిస్తే ఆందోళనలకు సిద్ధమవుతామని ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

నాలుగు ఎకరాలు నాకు.. మిగతా మీకు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మఠం భూములపై కన్నేసిన స్థానిక టీడీపీ ముఖ్యనేత గతంలో అవిలాల గ్రామానికి వెళ్లే దారిలోని మఠం భూములను అడ్డగోలుగా దోచేసుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి. చిత్తూరు నుంచి గ్యాంగ్‌ను తీసుకొచ్చి మఠం అధికారులపై భౌతిక దాడులకు తెగబడి ప్రహరీ నిర్మాణం పూర్తి చేసినట్టు సమాచారం. ప్రస్తుతం ఆ భూములకు ఆనుకుని ఉన్న మిగతా మఠం భూములపై కన్నేసినట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మఠం భూములను దోచేసేందుకు పోటీ పడుతున్న నరసింహారెడ్డితో పాటు మరికొందరిని తన వద్దకు పిలిపించుకుని తనకు నాలుగు ఎకరాలు కేటాయించి మిగతా మీరు తీసుకోవచ్చన్న ఒప్పందం చేసుకున్నట్టు సమాచారం. ఆ మేరకు మఠం, ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇబ్బందీ రాకుండా చూసుకుంటానని హామీ ఇచ్చినట్టుగా తెలుస్తోంది.

మఠం భూమిలో హెచ్చరిక బోర్డు

ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డుల ప్రకారం 147/1లో 48.60 ఎకరాలు, 148/2లో 13.35 ఎకరాలు శ్రీ పరకాల స్వామి (హథీరాంజీ మఠం భూములుగా) పేరిట నమోదైనప్పటికీ ఆ భూమి నరసింహారెడ్డికి చెందినట్టుగా హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు నివ్వెర పోతున్నారు. అంతేకాకుండా ఈ మఠం భూముల దురాక్రమణలో స్థానికంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని పార్టీల ముఖ్యనేతలకు ఆక్రమణదారుల నుంచి ఇప్పటికే పెద్ద ఎత్తున ముడుపులు చేరాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఆ భూములన్నీ మఠానికి చెందినవే

"తిరుపతి రూరల్ మండలం, అవిలాల గ్రామ రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నం.145, 147/1, 148 ఉన్న భూములు శ్రీపరకాల స్వామి హథీరాంజీ మఠానికి చెందినవే. గతంలో మఠాధిపతుల నుంచి జీపీఏలు చేసుకుని కోర్టుల్లో కేసులు వేశారు. దీంతో నరసింహారెడ్డి వంటి ప్రయివేటు వ్యక్తులు కొందరు మా భూమి అంటూ ముందుకు వస్తున్నారు. అవిలాల దగ్గర ఉన్న భూములు సర్వే చేయించాలని రెవెన్యూ అధికారులకు మఠం తరపున లెటరు కూడా పెట్టాం. సర్వే చేయడంలో జాప్యం జరుగుతోంది. వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేయించి భూమిని స్వాధీనం చేసుకుంటాం. – కేశవులు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, హథీరాంజీ మఠం

నోటీస్ బోర్డు

నేడు మహిళా వర్సిటీకి ఐఎస్ఓ బృందం



తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో ఐఎస్ఓ నిపుణుల బృందం బుధవారం నుంచి రెండు రోజుల పాటు పర్యటించనుంది. ఇందులో భాగంగా వర్సిటీలోని పలు విభాగాల్లో నాణ్యతా ప్రమాణాలను, పలు శాఖల శాస్త్రీయ విధానాలు, అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్, పరిశోధన, సామాజిక సేవా కార్యక్రమాలు తదితర అంశాలపై సమీక్షించనుంది. ఈ సందర్భంగా ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ త్రిపురసుందరి మాట్లాడుతూ నిరంతర నాణ్యత అభివృద్ధికి ఇది ఒక కీలకమైన అడుగు పడుతోందన్నారు.

పాలిసెట్ దరఖాస్తుకు గడువు పొడిగింపు

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోని పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీన పాలిసెట్–2025 ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 15వ తేదీ వరకు ఉన్న గడువును ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించారు. ఆ మేరకు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 86888 88802, 86888 88803, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

కాల్షియం కార్బైడ్ వాడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: మామిడి కాయలు మాగబెట్టడానికి కాల్షియం కార్బైడ్‌ను వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆయన మంగళవారం మామిడి జిల్లాస్థాయి అధికారుల కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి కాయలు సహజ సిద్ధంగా మాగడానికి వరిగడ్డిని వాడడంతోపాటు పేపర్ బాగ్స్, నాచురల్‌గా సహజ హార్మోన్ ఎతిలీన్ గ్యాస్ స్ప్రే చేయడం, రిపెనింగ్ ఛాంబర్‌లో ఎతిలీన్ హార్మోన్ ఉపయోగించి మగ్గబెట్టడం శీతల గిడ్డంగుల్లో కూడా ఎతిలీన్ హార్మోన్ ఉపయోగించి మామిడి పండ్లు మగ్గబెట్టవచ్చని చెప్పారు. మానవులకు ప్రమాదం లేకుండా ఉండే వాటిని మాత్రమే మగ్గబెట్టడానికి వినియోగించాలని ఆదేశించారు. అంతేతప్ప ప్రమాదకరమైన కాల్షియం కార్బైడ్ వినియోగిస్తే వారికై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. పదేపదే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అధికారులు శాంపిళ్లు తీసి, పరిశీలించాలని స్పష్టం చేశారు. కమిటీలోని ఏడు విభాగాలైన ఫుడ్ సేఫ్టీ, మార్కెటింగ్, మున్సిపల్, మెడికల్, పంచాయతీ, ఉద్యానశాఖ, ట్రాన్స్‌పోర్ట్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, డీపీఓ సుశీలాదేవి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వర్ రావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దిలేటి, ఫుడ్ సేఫ్టీ అధికారులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సలకు పేదరోగుల ఎంపిక

తిరుపతి తుడా: టీటీడీ ప్రాణదాన పథకం కింద 172 మంది పేదరోగులను పలు శస్త్ర చికిత్సల నిమిత్తం ఎంపిక చేశారు. టీటీడీ పరిపాలన భవనం సమావేశ మందిరంలో మంగళవారం టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం అధ్యక్షతన ప్రాణదాన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్, సూపరింటెండెంట్ రామ్, ఇన్‌చార్జ్ ఆర్ఎంఓ శివశంకర్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ గోపి, టీటీడీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ నర్మద, బర్డ్ హాస్పిటల్ రామమూర్తి, రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు. పేషెంట్స్ ఆరోగ్య స్థితిగతులను, బియ్యం కార్డు కలిగి దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న నిరుపేదలను అర్హతల ఆధారంగా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడానికి వివిధ విభాగాల కింద ఎంపిక చేశారు. ఇందులో కార్డియాలజీ 1, కార్డియో థొరాసిక్ 18, ఈఎన్‌టీ 8, జనరల్ సర్జరీ 1, మెడికల్ ఆంకాలజీ 1, మెడిసిన్ 12, నెప్రాలజీ 39, న్యూరాలజీ 23, న్యూరో సర్జరీ 29, గైనకాలజీ 8, రేడియేషన్ అంకాలజీ 5, సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ 23, సర్జికల్ అంకాలజీ 3, సైకియాట్రీ 1 పేషెంట్‌ని ఎంపిక చేశారు.

తిరుపతిలో స్పేక్స్ మోడల్ హబ్

- ఏర్పాటుకు ఐఐటీ, ఏపీఐఐసీ భవనాల పరిశీలన


ఐఐటీ కార్యాలయం వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్, అధికారులు

తిరుపతి అర్బన్: నగరంలో స్పేక్స్ మోడల్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. తాత్కాలిక భవనాల కోసం కలెక్టర్‌తో పాటు పలు విభాగాలకు చెందిన అధికారులు మంగళవారం తిరుపతిలో పలు ప్రాంతాలను పరిశీలించారు. తిరుపతిలోని ఐఐటీ, ఏపీఐఐసీకి చెందిన పలు భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అనుసంధానంగా స్పేక్స్ మోడల్ హబ్‌ను ఏర్పాటు చేయడానికి రాష్ట్రంలో ఐదు హబ్‌లను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. అందులో తిరుపతి ఒకటని పేర్కొన్నారు. స్పేక్స్ మోడల్ హబ్ విద్యార్థుల నూతన ఆలోచనలకు దోహదపడుతుందని తెలిపారు. ఆదానీ, అమరరాజా, నవయుగ పరిశ్రమల సహకారంతో ఐఐటీ తిరుపతి సరికొత్త టెక్నాలజీ ఆవిష్కరణలతో స్పేక్స్ మోడల్ హబ్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీఈసీఓఎస్‌డీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా దీప్తి, ఐఐటీ ఏర్పేడు డైరెక్టర్ సత్యనారాయణ, అమరాజా ఆదోని కంపెనీ ప్రతినిధులు, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, చీఫ్ ఆర్కిటెక్చర్ మణి సందీప్, సిఓఓ ఆదాని కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ రాజన్‌బాబు, నవయుగ సీఈఓ సుబ్బారావు, పీడీలు డీఆర్‌డీఏ, మెప్మాలకు చెందిన శోభన్ బాబు, రవీంద్ర, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సుధాకర్ రావు, ఏర్పేడు తహసీల్దార్ భార్గవి, డీటీ మాధురి పాల్గొన్నారు.

శ్రీసిటీలో వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ క్యాబిన్‌లు



వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలోని బీఎఫ్‌జీ ఇండియా పరిశ్రమ వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల క్యాబిన్లను తయారు చేస్తూ సత్తా చాటుతోంది. ఈ ప్రాజెక్ట్‌లో 16–కోచ్‌ల రైలు కోసం ఇంటీరియర్స్, మాడ్యులర్ టాయిలెట్ క్యాబిన్‌లు, ఏరోడైనమిక్ ఫ్రంట్ ఎండ్‌ల రూపకల్పన, తయారీ, ఇన్‌స్టాల్ చేయడం లాంటివి చేపడుతోంది. రైలులో 823 బెర్త్‌లు, 51 టాయ్‌లెట్లు ఉంటాయని బి.ఎఫ్.జీ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కె.ప్రేమమూర్తి తెలిపారు.

మెట్రో ప్రాజెక్టుల్లో కీలకం


భారతదేశ మెట్రో రైలు ప్రాజెక్టుల అభివృద్ధిలో బీ.ఎఫ్.జీ కీలక పాత్ర పోషించిందని శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. భారతీయ ప్రతిష్టాత్మక రైల్వే, సముద్ర రవాణాతో సహా బహుళ రంగాలలో 'మేడ్ ఎట్ శ్రీసిటీ' ఉత్పత్తులను ఉపయోగించడం గర్వంగా ఉందన్నారు. ఫెర్రీ–ఆధారిత పట్టణ రవాణా అయిన కొచ్చి వాటర్ మెట్రోకు కూడా బీ.ఎఫ్.జీ భాగస్వామ్యాన్ని అందించినట్టు ఆయన పేర్కొన్నారు.

రేణిగుంటలో మహారాష్ట్ర అధికారుల పర్యటన


రైతులతో సమావేశమైన అధికారుల బృందం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రాష్ట్రంలో రైతుల భూముల రీసర్వే విధానంపై అధ్యయనం చేసేందుకు మహారాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ చొక్కా లింగం సేతు లింగం మంగళవారం రేణిగుంట మండలంలో పర్యటించారు. మండలంలోని, గుత్తివారిపల్లి సచివాలయంలో తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్, రేణిగుంట మండల తహసీల్దార్ సురేష్ బాబు వివిధ కేటగిరీల సర్వే అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ముందుగా సర్పంచ్ మంజుల, స్థానిక నాయకులు మునస్వామి నాయుడు, అధికారులకు సాదరంగా స్వాగతం పలికారు. రైతులు పలు భూ సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని, భూముల రీ సర్వేలో చిన్న చిన్న లోపాలను కూడా పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

అనర్హత వేటుకు సిఫార్సు చేయండి


ఏఓకు ఫిర్యాదు చేస్తున్న విప్ పూజారి లక్ష్మీ

చిల్లకూరు: ప్రజాస్వామ్యబద్ధంగా ఒక పార్టీ గుర్తుపై గెలిచి, ఆ పార్టీ ఇచ్చిన విప్‌ను ధిక్కరించి, మరో పార్టీకి మద్దతు ఇస్తున్న కౌన్సిలర్లపై అనర్హత వేటు వేసేందుకు సిఫార్సు చేయాలని వెంకటగిరి మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి మంగళవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓ శిరీషాను కలిసి విప్‌ను ధిక్కరించిన ముగ్గురు కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వెంకటగిరి మున్సిపాలిటీలో 25 మంది కౌన్సిలర్లు వైఎస్సార్ సీపీ బీఫామ్‌పై గెలిచారన్నారు. అయితే ఇటీవల జరిగిన పరిణామాల్లో ముగ్గురు కౌన్సిలర్లు పార్టీ విప్‌ను ధిక్కరించి అధికార టీడీపీకి మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. విప్‌ను ధిక్కరించిన క్రమంలో పట్టణంలోని 3,5,7 వార్డులకు చెందిన కౌన్సిలర్లు పీ పద్మావతి, నారి శేఖర్, కే చంద్రశేఖర్‌రెడ్డిపై ప్రభుత్వ పరంగా అనర్హత వేటు వేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. వెంకటగిరి మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీకి పెట్టని కోటలా ఉందని, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అండతో పటిష్టంగా ఉండి, భవిష్యత్తులో పట్టణాభివృద్ధికి సహకారం అందించే దిశగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

ఐటీడీపీ అరాచక శక్తులపై చర్యలు తీసుకోండి

– జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా


పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళలతో కలిసి మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు ప్రిస్కిల్లా

పెళ్లకూరు: కూటమి ప్రభుత్వం అండతో మానవ విలువలను విస్మరించి రాక్షసుల్లా ప్రవర్తిస్తున్న ఐటీడీపీ అరాచక శక్తులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని పెళ్లకూరు జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని అన్ని ప్రాంతాలకు చెందిన వైఎస్సార్ సీపీ మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు చేరుకుని స్థానిక ఎస్ఐ నాగరాజును కలిసి ఫిర్యాదు చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిపై సోషల్ మీడియాలో ఐటీడీపీ చేస్తున్న అసభ్యకరమైన పోస్టులను ఖండిస్తూ నిందితులను వెంటనే శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అసభ్యకరంగా పోస్టులు పెడుతున్న ఐటీడీపీ నిర్వాహకులకు కూడా అక్కాచెల్లెళ్లు ఉంటారని మహిళలను కించపరిచేలా వైఎస్సార్ కుటుంబ ప్రతిష్టను దిగజార్చేలా ప్రవర్తిస్తున్న వారిని వెంటనే శిక్షించాలన్నారు. ఐటీడీపీని వెనుకుండి నడిపిస్తున్న మంత్రి లోకేష్, హోంమంత్రి అనిత స్పందించి నిందితులను శిక్షించాలన్నారు. రాజ్యాంగ చట్టాలు దేశంలోని ప్రతి ఒక్కరికీ సమానమని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుధారాణి, ఎంపీటీసీ సభ్యులు సుజాత, సునీత, సర్పంచ్‌లు లక్ష్మి, కల్పన, చిత్ర, పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు శైలజ, ఎంపీటీసీ మాజీ సభ్యులు శ్రీదేవి పాల్గొన్నారు.

టీడీపీ అంటే టాపిక్ డైవర్షన్ పార్టీ



అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైంది. టీడీపీ అంటేనే టాపిక్ డైవర్షన్ పార్టీ అని రాష్ట్ర ప్రజలకు పూర్తిగా అర్థమైంది. మహిళలను కించపరిచేలా ఐటీడీపీ వ్యవహరిస్తున్నా పట్టించుకోకుండా టీడీపీ నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారు. అభిమానులను అడ్డం పెట్టుకుని మాట్లాడే పవన్‌కల్యాణ్‌కు ఐటీడీపీ వ్యవహరిస్తున్న తీరు కనిపించడం లేదా?. – నన్నం ప్రిస్కిల్లా, జెడ్పీటీసీ సభ్యురాలు, పెళ్లకూరు

మహిళలపై గౌరవం లేదు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిపై ఐటీడీపీ అసభ్యకరమైన పోస్టులు పెట్టడం దారుణం. మహిళల మాన,ప్రాణాలకు పూర్తి భద్రత అంటూ ప్రగల్భాలు పలికిన పవన్‌కల్యాణ్‌కు మహిళలపై గౌరవం లేదు. – ఇలకా సుధారాణి, వైస్ ఎంపీపీ, పెళ్లకూరు

వలంటీర్లను మోసం చేశారు



వలంటీర్ వ్యవస్థను కొనసాగించడమే కాకుండా వేతనం రూ.10 వేలకు పెంచి అండగా నిలుస్తామని అబద్ధాలు చెప్పి మోసం చేశారు. వలంటీర్ వ్యవస్థను కొనసాగించేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జీఓ లేదని అబద్దాలు చెప్పడం అన్యాయం. వచ్చే ఎన్నికల్లో సత్తా ఏమిటో కచ్చితంగా చూపిస్తాం. – బిందు, మాజీ వలంటీర్, చిల్లకూరు

ఆడబిడ్డల కష్టాలను చూశా


బస్సుపాస్ కేంద్రాన్ని పునఃప్రారంభిస్తున్న డీపీటీఓ

తిరుపతి అర్బన్: ఆడ బిడ్డల కష్టాలను చూశానని, అందుకే బస్‌పాస్ కేంద్రం మార్పునకు చర్యలు తీసుకున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి నరసింహులు తెలిపారు. ఏడుకొండల బస్టాండ్ వద్ద బస్సుపాస్ కేంద్రాన్ని పునః ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో ఇలా మాట్లాడారు. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక రోజు ఏడుకొండల బస్టాండ్ వద్ద ఉత్తరం వైపున ఎండలో ఆడబిడ్డలు బస్సుపాస్‌ల కోసం క్యూలో ఉండడాన్ని గుర్తించానన్నారు. ఆ మేరకు మంగళవారం ఏడుకొండల బస్టాండ్‌లోనే దక్షిణం వైపు బస్సుపాస్ కేంద్రాన్ని పునఃప్రారంభించామని వెల్లడించారు. ఈ నెల 30న తాను ఉద్యోగ విరమణ పొందుతున్నామని చెప్పారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథం, ఏటీఎం డీఆర్ నాయుడు, ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లాచంద్రయ్య, తిరుపతి డిపో నేత నరసింహులు పాల్గొన్నారు.

కొండకు ట్రిప్పులు పెంచుదాం


కొండకు అదనపు సర్వీసులు ఏర్పాటుపై డిప్యూటీ సీటీఎంతో చర్చిస్తున్న డీపీటీవో నరసింహులు

తిరుపతి అర్బన్: వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమల కొండకు భక్తులు పెరుగుతున్నారు, మరింత పెరిగే అవకాశాలున్నాయని, కొండకు బస్సు ట్రిప్పులు పెంచుదామని డీపీటీఓ నరసింహులు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం మంగళవారం డీపీటీఓ కార్యాలయంలో చర్చించుకున్నారు. ఈ నెల 16 నుంచి అదనపు ట్రిప్పులు తిప్పడానికి నిర్ణయించారు. ప్రస్తుతం 405 సర్వీసులు రోజుకు 1,650 ట్రిప్పులు నడుపుతున్నారు. బుధవారం నుంచి అదనంగా సత్యవేడు డిపోకు చెందిన 9, పుత్తూరు డిపోకు చెందిన 9, శ్రీకాళహస్తి డిపోకు చెందిన 25 సర్వీసులను తిరుమల కొండకు నడపనున్నారు. దీంతో రోజుకు 1950 ట్రిప్పులు తక్కువ లేకుండా కొండకు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అంతేకాకుండా ప్రస్తుతం తిరుపతి ఏడుకొండల బస్టాండ్‌లో టిక్కెట్ కౌంటర్ ఒక్కటి మాత్రమే ఉందని, భక్తుల రద్దీని బట్టి అదనపు కౌంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గత సర్కార్‌లో ఏర్పాటు చేసిన 100 విద్యుత్ బస్సుల్లో 85శాతం సర్వీసులు మాత్రమే వాడుకలో ఉన్నాయి. ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. విద్యుత్ సర్వీసుల నిర్వాహణాధికారి జగదీష్, అలిపిరి డీఎం హరిబాబుతో మాట్లాడి 85 శాతం నుంచి 95 శాతానికి సర్వీసులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని చర్చించారు. ఈ విషయంపై డీపీటీఓ నరసింహులు మాట్లాడుతూ వేసవి నేపథ్యంతోపాటు విద్యార్థులకు ఏప్రిల్ 23 నుంచి సెలవులున్న క్రమంలో తిరుమల కొండకు అదనపు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అలాగే వందశాతం విద్యుత్ బస్సులను వాడుకలోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు.